# అత్యాచారం

— అబ్బూరి ఛాయాదేవి

తలుపుతీసి, ఆ వచ్చినవాళ్ళని చూసి సేల్స్‌ప్రమోటర్స్ కాబోలు అనుకుని "ఏమీ అక్కర్లేదు, దయచేసి వెళ్ళండి" అంటూ తలుపు మూయబోయాను.

వచ్చిన అయిదుగురిలో వెనకాల నిలబడిన గడ్డం యువకుడు చటుక్కున ముందున్న ఆడవాళ్ళని తోసుకుని ముందు కొచ్చి "మీరు 'అసావేరి'గారు కదా మేడమ్" అన్నాడు. అక్కడికీ అనుమానం తీరక "మీరెవరు?" అన్నాను.

"నా పేరు 'దండోరా'. నేను 'ఆంధ్ర' సాంస్కృతిక సంస్థలూ - సన్మానాలూ' అనే విషయం మీద పరిశోధన చేస్తున్నానండీ. వీరంతా వర్ధమాన రచయిత్రులు" అన్నాడు. నేను కాస్త తొట్రుపడి "అలాగా! రండి లోపలికి" అని సాదరంగా ఆహ్వానించాను. వాళ్ళు కూర్చున్నాక అడిగాను-"ఏమిటి విశేషం? ఇలా వచ్చారు!" అని.

ఆ ఆడవాళ్ళలో అందరికన్నా లావుపాటావిడ గొంతు సవరించుకుంది. ఉలిక్కిపడ్డాను. ఆవిడవైపు చూశాను.

"నేను 'విహ్వల భారతి' అనే వనితా సాంస్కృతిక సంస్థకి కార్యదర్శిని. మేము ప్రతి సంవత్సరం ఒక ప్రముఖ మహిళకి సన్మానం చేస్తూంటామండీ. ఈ సంవత్సరం మీకు సన్మానం చెయ్యాలని మా కమిటీ తీర్మానించిందండీ" అంది వంకరగా నవ్వుతూ.

"అమ్మ బాబోయ్!" అన్నాను. గుండెమీద చెయ్యి వేసుకున్నానో లేదో, ఆ కంగారులో ఏం చేశానో నాకే స్పృహ లేదు.

"అదేమిటండీ, అంత కంగారు పడ్డారు!" అన్నాడా గడ్డం యువకుడు.

"నేను వేదిక కింద, వెనక వరసలో ఓ మూల కూర్చోవడమేగాని, ఇంత వరకు వేదిక ఎక్కలేదండి ఎప్పుడూ. అదీకాక, నేను ఎన్నో కథలు రాయలేదు కదా, నాకు సన్మానం ఏమిటండీ!" అన్నాను వొణుకుతున్న కంఠంతో.

గలగలమంటూ గవ్వల శబ్దంలా వినిపించింది. కాదు, వాళ్ళలో లావుపాటావిడ నవ్వింది. అంతవరకూ ఒదిగి కూర్చున్నావిడ వెనక్కి జార్లబడి, కాలుమీద కాలు వేసుకుని "వేదిక మీద కూర్చోవడానికి భయం దేని కండీ! అక్కడ కూర్చుంటే, కింద కూర్చుని వినే వాళ్ళంతా ఎంత అల్పులుగా కనిపిస్తారో మీకే తెలుస్తుంది! మీరు ఒప్పుకోవాలి అసావేరి గారూ" అంది.

నేను నోరు మెదిపే లోపల మరో రచయిత్రి అందుకుంది. "ప్రసిద్ధ గాయని కీచుబాయిగారూ, ప్రఖ్యాత సినీతార "రోతశ్రీ" గారూ ప్రత్యేక అతిథులుగా వస్తారు ఆ సన్మాన సభకి" అందామె నన్ను ఊరించడానికన్నట్టు.

"ఇంతకీ నాకే సన్మానం చెయ్యాలని ఎందుకు నిశ్చయించుకున్నారు?"

"అలా అడగండి చెబుతాను" అన్నట్టు ఉత్సాహంగా కాస్త ముందుకు జరిగి, ఒక బక్కపలచగా వున్నావిడ మొదలు పెట్టింది "గంగిగోవు పాలు గంటెడైనను చాలు" అన్నట్లు మీరు కొంచెం కథలు రాసినా, మీ కథలకు ఎంచుకున్న ఇతివృత్తాలు చెప్పుకోదగినవి..."

"అటువంటి ఇతివృత్తాల మీద ఎన్నో కథలూ,



నవలలూ వచ్చాయి కదండీ. నా రచనలు ఏపాటివి! - సముద్రంలో నీటి బొట్టులా!" అన్నాను.

"అమ్మో, అలా అనకండి. ఒక అబలపైన మూకుమ్మడిగా అత్యాచారం జరపడాన్ని మీరు చిత్రించి నట్టుగా ఎవ్వరూ చిత్రించలేదు. దానికి మీరు సూచించిన పరిష్కారం కూడా కనీవినీ ఎరుగనిది!" అంది.

నేను సిగ్గుపడి తలవంచుకున్నాను. దాన్ని అంగీకారంగా తీసుకున్నారులా వుంది. అంతా లేచి నుంచుని "వస్తాం మేడమ్. మీకు మా ధన్యవాదాలు. సన్మాన సభ వచ్చే ఆదివారం సాయంకాలం ఆరు గంటలకి "సన్మాన్ భవన్"లో జరుగుతుంది" అన్నారు. నేనింకా ఆ 'షాక్" నుంచి తేరుకోక ముందే వెళ్ళిపోయారు వాళ్ళు.

నేను గొప్ప రచయిత్రిని అనుకుంటూ ఎంత ఉప్పొంగుదామన్నా ఎందుకో గుండె కుంచించుకు పోతోంది.

ఆదివారం రానే వచ్చింది. అనుకున్న దానికన్నా ముందే వచ్చేసినట్లనిపించింది నా ప్రాణానికి. పొద్దున్నే ఆ సన్మాన సభ తాలూకు మనిషొకడు వచ్చి "సాయంకాలం 5-30కి కారు తీసుకొస్తారు. రెడీగా వుండండి" అని చెప్పి వెళ్ళాడు. ఏం చెయ్యాలో తోచక, నేను రాసిన కథల్ని మరోసారి చదువుకున్నాను. నా హృదయం ఎందుకో ఆర్ద్రమైంది.

ఎర్రంచు తెల్లచీర కట్టుకుని కూర్చున్నాను, కారు కోసం ఎదురుచూస్తూ. "రోట్లో తల దూర్చి రోకటి పోటుకి వెరసేలా" అన్నట్లుగా వుంది నా పరిస్థితి.

ఆ సంస్థ కార్యదర్శి వచ్చింది కారులో నన్ను తీసుకు వెళ్ళడానికి. ఆవిన్ని చూశాక నాకు కొంచెం ధైర్యం చిక్కింది-అంత క్రితం ఆవిడ చెప్పిన "వేదిక రహస్యం" గుర్తుకొచ్చి. మావారు "బెస్ట్ ఆఫ్ లక్" అని పొద్దున్నే చెప్పారు.

"సన్మాన్ భవన్" సమీపిస్తూనే సన్నాయి వాద్యం లౌడ్ స్పీకర్లలోంచి చెవులు హోరెత్తేటట్లు వినిపించింది. నా పెళ్ళికి కూడా అంత గట్టిగా వాయించలేదు! "సన్నాయివాళ్ళని కూడా పెట్టారేమిటి!" అన్నాను

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 7-6-90

